క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



రమణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సరుబుజ్జిలి: రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆర్.వి.రమణమూర్తిని పాఠశాలలో మంగళవారం సత్కరించారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఈయన ఎంపికయ్యారు. ఈ సన్మాన కార్యక్రమంలో హెచ్ఎం కత్తిరి రామకృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరును బాగుచేయరూ..



మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం పంచాయతీ దాసుపురంలోని తాగు నీటి బోరు మరమ్మతులకు గురైంది. బోరు పాడైపోయి నెలలు కావస్తున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకునే దాఖలాలు లేవు. స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



ఆరుద్రమ్మను పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

కొత్తూరు: మండల కేంద్రంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం చైర్మన్ మామిడి శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. కొత్తూరుకు చెందిన బోగాపురం ఆరుద్రమ్మ, టొంపల గోపాల్, పడాల లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కొత్తూరుకు చెందిన బొద్దల శ్రీనివాసరావు కుమార్తె ఇటీవల మృతి చెందటంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు గోగుల వరప్రసాదరావు నాయుడు, పి.రామారావు ఉన్నారు.

బదిలీ అధ్యాపకులకు సన్మానం



బదిలీ అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి బదిలీపై వెళ్లినవారికి ప్రిన్సిపాల్ పీఈఎస్ పట్నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇక్కడ అధ్యాకులుగా పనిచేసిన కె.పాపారావు కింతలి కళాశాలకు, రాజేశ్వరరావు రాజాం కళాశాలకు, శరత్‌బాబు పెందుర్తి కళాశాలకు బదిలీపై వెళ్లారని తెలిపారు. విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని పలువురు అధ్యాపకులు అన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తండ్రితో ఉన్న బాలుడు

తిరుపతి క్రైమ్: శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన ఓ బాలుడు హాస్టల్ నుంచి పరారై తిరుపతికి రాగా తిరుపతి వెస్ట్ పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వెస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నంకు చెందిన నిరంజన్‌రావు కుమారుడు విశాఖపట్నంలో ఎనిమిదో తరగతి చదువుకుంటూ హాస్టల్లో ఉండేవాడు. సోమవారం హాస్టల్లో ఎవరికీ చెప్పకుండా తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు రైల్లో తిరుపతికి చేరుకున్నాడు. అలిపిరి వద్ద ఒంటరిగా కనిపించగా పోలీసులు ఆరా తీశారు. దీంతో బాలుడు వివరాలు తెలిపాడు. వెంటనే అతని తల్లిదండ్రులకు సమాచారం అందించి బాలుడిని సురక్షితంగా వారికి అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

జలుమూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

● ఉజ్వల భవిత



సైన్స్‌తో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జలుమూరు మండలం లింగాలవలస ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉంగటి అప్పల సూర్యనారాయణ అన్నారు. పాఠశాల ఆవరణలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరగనున్న చెకుముకి సైన్స్ సంబరాలు గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. చెకుముకి సైన్స్ జేవీవీ మండల కన్వీనర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి పోటీలు ఈ నెల 25న, మండల స్థాయి పోటీలు అక్టోబర్ 1న, జిల్లా స్థాయి పోటీలు అక్టోబర్ 27న, రాష్ట్ర స్థాయి పోటీలు నవంబర్ 9, 10వ తేదీల్లో ఉంటాయన్నారు. ఉపాధ్యాయులు జల్లు రమణ మూర్తి, విశ్వనాథం, చెట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

– జలుమూరు

● అవస్థలు..



నరసన్నపేట మండలం కంబకాయ పశువైద్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో ఆవులతోపాటు జీవాలకు వైద్యం లభించడం లేదని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వైద్యునిగా ఉండే లక్ష్మణరావు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతానికి వెళ్లిపోయారు. ఈయన స్థానంలో డిప్యుటేషన్‌పై నియమించిన షణ్ముఖరావు నెల రోజులుగా రాకపోవడం లేదు. కంబకాయ ప్రాంతంలో పాడి పశువులు, జీవాలు అధికంగా ఉన్నాయని, వైద్యుడు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని పాగోటి ప్రభాకరరావుతోపాటు పలువురు రైతులు అన్నారు. పశువులకు వ్యాధులు సోకితే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పశువైద్యుడిని నియమించాలన్నారు.

– నరసన్నపేట

● శిథిలావస్థ



హిరమండలం మండల పరిషత్ కార్యాలయ రహదారి పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ బంగ్లా అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. కొన్నేళ్లుగా ఈ భవనం వాడులో లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. గతంలో ఆర్అండ్‌బీ విధులన్నీ ఇక్కడ నుంచి నిర్వహించేవారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ప్రజా ప్రతినిధులు, అధికారులు వస్తే ప్రైవేట్ లాడ్జీలు, వంశధార అతిథి గృహాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు భవనాన్ని వినియోగంలోకి తీసకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

– హిరమండలం

ఊరిదో సమస్య..

- గ్రామాలను వీడని మురుగునీరు
- గోతుల మయంగా గ్రామీణ రహదారులు
- వంద రోజుల పాలనలో చేసింది శూన్యం



మురికి కూపంగా ఉన్న దొంకలబడవంజ వీధి రోడ్డు

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి కావడంతో గ్రామాల్లో పండగలు చేసుకుంటున్నారు. ఈ వంద రోజుల పాలనలో ఒక్క సమస్య కూడా పరిష్కరించ లేదని అన్నివర్గాల వారు ఆరోపణలు చేస్తున్నారు. గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రోడ్లు గోతులమయంగా మారిపోయి వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో 108 రాలేని దుస్థితి ఏర్పడింది. అనేక గ్రామాల్లోని వీధుల్లో మురుగునీరు, వర్షం నీరు నిల్వ ఉండటంతో దుర్గందంతోపాటు ఈగలు, దోమలు వృద్ధి చెందిన అనేక రోగాలను వ్యాపిస్తున్నాయి. రైతులకు సాగునీరు అందించే వంశధార కుడి ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువల్లోనూ గుర్రపుడెక్క పేరుకుపోయి సాగునీరు ప్రశ్నార్థకంగా మారిపోయింది. గట్టిగా వర్షం పడితే తురకపేట వద్ద కడపలవానిగెడ్డపై వరద నీటి ప్రవాహం, ఏబీ రోడ్డుపై నుంచి కోవిలాం కాలనీలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఇలా అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నప్పటికీ పట్టించుకునే పాలకుడే లేడని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ఊసేలేదు. చంద్రబాబు సీఎంగా ఈ వంద రోజుల్లో ఏదో చేశారని చెప్పుకునేందుకు గ్రామాలకు వస్తున్న కూటమి నాయకులకు ఆ ఊరికి ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితి ఏర్పడింది



చెరువును తలపించేలా కొమ్మువలస రోడ్డు



ముంగిన్నపాడు వద్ద వంశధార కుడి ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఏబీ రోడ్డుపై కోవిలాం కాలనీ వద్ద వరదనీటి ప్రవాహం



కడపలవాని గెడ్డపై నెల రోజులుగా తగ్గని వరదనీరు

ఇసుక తరలింపులో హైడ్రామా

- అధికారులకు అడ్డగింత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



పాతనిమ్మతొర్లువాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు



టిప్పర్‌లోకి ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీతీరంలోని పాతనిమ్మతొర్లువాడ, కొరపాం, నిమ్మతొర్లువాడ వద్ద ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది పోగుచేసిన ఇసుకను ఇటీవల తహసీల్దార్ రాంబాబు, రెవెన్యూ, గనులశాఖ అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఈ ఇసుకను తరలించి ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు అందజేసేందుకు మంగళవారం అధికారులంతా ఆయా గ్రామాల పరిధిలో గల ఇసుక పోగుల వద్దకు ట్రిప్పర్లు, జేసీబీలతో వెళ్లారు. ఇసుక తరలించేందుకు వీళ్లేదని ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది అడ్డుకున్నారు. తొగరాం, దూసి, కొత్తవలస తదితర ప్రాంతాల్లో నిల్వలను విడిచిపెట్టి తమ గ్రామాల్లో గల నిల్వలు మాత్రమే తరలించేందుకు చర్యలు చేపట్టడం ఏంటని అధికారులను అడ్డుకున్నారు. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తన సిబ్బందితో అక్కడకి చేరుకున్నారు. పోలీసుల రంగప్రవేశంతో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. అధికారులు, ఆయా గ్రామాలకు చెందిన కొంతమంది కాసేపు మాట్లాడున్నారు. కొంత సమయం తరువాత కొరపాం పంచాయతీలోని 70 క్యూబిక్ మీటర్లు, నిమ్మతొర్లవాడ పంచాయతీలోని 90 క్యూబిక్ మీటర్ల ఇసుకను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఇసుక ప్రభుత్వ భవనాల నిర్మాణానికి, ఎన్టీఆర్ గృహాలకు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. పలు వాహనాల్లో ఇసుకను తరలించారు. మిగతా ఇసుక పోగులను అక్కడే విడిచిపెట్టారు.

జిల్లా స్థాయి పోటీలకు 122 మంది ఎంపిక



జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నరసన్నపేట: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలురకు పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగాతో పాటు అథ్లెటిక్స్‌లో జిల్లా స్థాయికి 122 మందిని ఎంపిక చేశారు. ఈ పోటీలను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. కబడ్డీలో చెరో 9 మంది చొప్పున, ఖోఖోలో చెరో 11, వాలీబాల్‌లో చెరో 8 మంది, బ్యాడ్మింటన్ పోటీలకు చెరో ఐదుగురు, యోగాలో చెరో ఐదుగురుని ఎంపిక చేశారు. అథ్లెటిక్స్‌లో అండర్ 14 విభాగంలో 20 మందిని, అండర్ 17 విభాగంలో 26 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 410 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, నరసన్నపేట ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబుతోపాటు స్కూల్ గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఆనంద్, వ్యాయామ ఉపాధ్యాయులు గోపి, రెడ్డి రవి, ఎం.ఆనంద్‌కిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. బుధవారం బాలికలకు పోటీలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు.

వరిలో యాజమాన్య పద్ధతులే కీలకం



పొందూరు: గోరింటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నరసన్నపేట: వరిలో రైతులు వ్యయాన్ని తగ్గించి దిగుబడి పెంచుకోవాలంటే యాజమాన్య పద్ధతులు సక్రమంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీ, పొలం బడి ప్రత్యేకాధికారి సత్యవతి అన్నారు. లుకలాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయ సిబ్బంది నిర్వహించారు. ప్రస్తుతం వరి పైర్లు చిరుపొట్ట దశలో ఉన్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఓ కె.సునీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల వెంకటరావు, సర్పంచ్ తవిటినాయుడు రైతులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: పంట సాగు సమయంలో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండలంలోని యంబరాం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలన్నారు. సర్పంచ్ వెలమల గోవిందరావు, రైతులు ముద్దాడ చిట్టి, రామారావు, గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం: పంటలు సాగుచేయడంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలని ఏఓ బి.సంధ్య అన్నారు. భగీరథిపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సారవకోట: వరి పంటలో యూరియా వాడకాన్ని తగ్గించాలని ఏ వెంకటరావు సూచించారు. బుడితి, చీడిపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈఓ కంఠయ్య, వీహెచ్ఏ దిలీప్, ఎంపీటీసీ మురళి, మాజీ ఎంపీటీసీ నిక్కు కృష్ణారావు ఉన్నారు.

బూర్జ: మామిడివలసలో ఏఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. బూర్జ గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వరి పంటలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీలు, గ్రామపెద్దలు, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

పొందూరు: వ్యవసాయంలో వృద్ధి సాధించాలంటే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏఓ బి.బాబ్జి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గోరింట, దళ్లవలస గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

జలుమూరు: వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులతోపాటు చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ కె.సురేష్ కుమార్ అన్నారు. పాగోడు, అక్కురాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



పొందూరు: మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ పీడీ నగేష్

పొందూరు: మండలంలో మంజూరైన గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.నగేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మన ఇళ్లు–మన గౌరవంపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు మండలంలో మంజూరైన గృహాలను 2025 మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన గ్రామాల్లో గృహనిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ సీపాన హరిహరరావు, ఈఓపీఆర్డీ సింహాచలం, గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన ఇళ్ల పనులు పూర్తిచేయాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు చేసిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 2016–20 ఆర్థిక సంవత్సరాల మధ్యలో పీఎం ఆవాస్ యోజన కాలనీ ఇళ్లు మంజూరు చేయటం జరిగిందన్నారు. వాటిలో కొన్ని ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించలేదని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉప తహసీల్దార్ రషీద్ అహ్మద్, హౌసింగ్ ఏఈ కె.రమేష్, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, ఏఓ పైడి లతశ్రీ, పశువైద్యాధికారి జి.కవిత, ఏపీఓ వి.శ్రీదేవి, ఏపీఎం రవిరాజ్ పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా రాజులు



పాతపట్నం: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా గురుగుబెల్లి రాజులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కోటబొమ్మాళి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్ పి.వి.రమాపతిరావు కోటబొమ్మాళికి బదిలీపై వెళ్లారు. ఇక్కడకు వచ్చిన సబ్ రిజిస్ట్రార్‌కు సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సంతోష్ కుమార్ బదిలీపై ఆముదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. కోటబొమ్మాళిలో పనిచేసిన బాలన్న ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఆక్రమణలు తొలగించాలి

పొందూరు: మండలంలోని కింతలి గ్రామ పరిధిలో సర్వే నంబర్ 48లో గల ప్రభుత్వ భూమిలో పంచాయతీ, ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలంటూ మాజీ సర్పంచ్ దవళ గణపతి మంగళవారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. గతంలో నిర్మాణాలు నిలుపుదల చేయాలని అప్పటి తహసీల్దార్ ఆదేశించినా.. గ్రామానికి చెందిన నర్సింహులు, అక్కలనాయుడు అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా పూర్తి సర్వే నిర్వహించి నిర్మాణాలు తొలగించాలన్నారు.

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



పోలీస్ స్టేషన్‌కు తరలించిన బొలేరో

పాతపట్నం: పశువుల అక్రమ రవాణాను పాతపట్నం పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం రాత్రి మండలంలోని సీది కూడలి వద్ద ఎస్ఐ బి.లావణ్య వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను బొలేరోలో తరలిస్తుండంతో పట్టుకున్నారు. బలద సంతలో కొనుగోలు చేసి నారాయణవలస సంతో విక్రయించేందుకు జలుమూరు మండలం పెద్దదూగం గ్రామానికి చెందిన వ్యక్తి తన బొలేరో వాహనంలో తరలిస్తున్నాడని తెలిపారు. అతని కేసు నమోదు చేశామన్నారు. బొలేరోను సీజ్ చేశామన్నారు. ఏడు పశువులను కొత్తవలస గోశాలకు తరలిస్తామని ఎస్ఐ తెలిపారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



నరసన్నపేట: జైలు అధికారులకు సూచనలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

పాతపట్నం: ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక సబ్ జైల్‌లో ఖైదీలకు అందుతున్న వసతులను మంగళవారం పరిశీంలిచారు. ఆహారం, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, లైబ్రరీ, వంట గదిని పరిశీలించారు. జిల్లా న్యాయసేవా సమితి కార్యదర్శి, జడ్జి ఆర్.సన్యాసినాయుడు, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి, సబ్ జైల్ సూపరింటెండెంట్ రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, న్యాయవాదులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై ఆరా

నరసన్నపేట: స్థానిక సబ్ జైల్లో రిమాండ్ ముద్దాయిలకు అందుతున్న సదుపాయాలపై జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ఆరా తీశారు. మంగళవారం సాయంత్రం స్థానిక సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలు, ఖైదీలతో మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. జైల్లో కల్పిస్తున్న సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు వినియోగించుకోవాలన్నారు. కోర్టు భవనాలను పరిశీలించారు. న్యాయవాదుల సంఘం గది వర్షానికి కారుతుండటాన్ని జడ్జి దృష్టికి న్యాయవాదులు తీసుకువెళ్లారు. స్థానిక సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ, న్యాయవాదులు గొండు సత్యనారాయణ, రోణంకి కృష్ణంనాయుడు, జామి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల బదిలీ

ఆమదాలవలస: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎంఏఈగా పనిచేస్తున్న కె.అప్పలనాయుడుకు విశాఖపట్నం మున్సిపల్ కార్యాలయానికి, ఎన్విరాన్‌మెంట్ ఏఈగా పనిచేస్తున్న బి.సృజనకు శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయానికి బదిలీ అయింది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. విశాఖపట్నం జీవీఎంసీ నుంచి ఎంఏఈగా డి.మోహన్‌రావు, ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎంఏఈ పోస్టుకు విశాఖపట్నం జీవీఎంసీ నుంచి ఎంఏఈ ఎ.పి.ఎస్.జాన్సన్ బదిలీపై ఇక్కడకు రానున్నారు. వీరు విధుల్లో చేరాల్సి ఉంది.

విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలి

సారవకోట: వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ నేర్పించాలని పాతపట్నం డీఎస్‌డబ్ల్యూఓ సూర్యప్రభ సూచించారు. మంగళవారం రాత్రి ఆమె మండల కేంద్రంలోని సమీకృత వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, పరిసరాలు, మౌలిక సదుపాయాలు, రాత్రి భోజన మెనూను పరిశీలించారు. రానున్న 10వ తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళిక వేసుకుని సిద్ధం కావాలన్నారు. వార్డెన్ మోహన్‌రావు ఉన్నారు.